ఆ భార్య భర్తతో పోట్లాడి, తను విషంతాగి పిల్లకి విషం ఇచ్చిందట. అది నిజంగా విషమనుకోని ఆ భర్త, 'నీకు చచ్చే ధైర్యం కూడా వుందా చస్తేచావు' అన్నాట్ట! కానీ నిజంగానే కాస్సేపటికి అందరూ చచ్చిపడున్నార్ట. వాళ్ల దెబ్బలాటలు వింటున్న అత్తా మామలు, మనలాగే వాళ్లే సర్దుకుంటారులే అని ఊరుకున్నార్ట! తెల్లారాక అందరూ ఆ ముసిల్వాని తిట్టారట. పెద్దవాళ్లు మీరుండి ఏంలాభం? ఆ మాత్రం సర్దిచెప్పవద్దా? అని! అంతేకాదు. పోలీసులు వాళ్ళని జైలుకి లాగారట. అంతవరకే రాశారు పేపర్లో!'అంది భయపడుతూ చెబుతూ.

ఆ వార్త రామశేషయ్యా చదివారు పేపర్లో! కాస్సే ఆలోచించి, ఇద్దరూ వెళ్లి కేదార్ బెడ్‌రూం తలుపుకొట్టారు.

కేదార్ రెండు నిమిషాలాగి తలుపుతీశాడు. "మీరింకా పడుకోలేదా?" అన్నాడు తండ్రిని చూసి. ఆయన సమాధానం చెప్పేలోగానే "మీరిద్దరూ దేనికో ఘర్షణ పడుతూంటే మాకు నిద్దరెలా వస్తుంది బాబూ" అంటూ ఇందిరాదేవి గదిలో కెళ్లి, మంచంమీద మోకాళ్ళ మీద తలపెట్టి కూర్చున్న కోడలితలని గడ్డంపట్టుకుని పైకెత్తింది. మేఘమాల కళ్లు ఏడ్చి ఏడ్చి ఎఱ్ఱని ఉల్లిపాయల్లా వున్నాయ్.

'మేఘా! పోట్లాడితే ఏంలాభం? మగవాడిని మంచిమాటలతో మచ్చిక చేసుకోవాలి.' ' అంది నవ్వుతూ..

"అది కాదత్తయ్యా.." ఏదో చెప్పబోయింది, మేఘమాల.

"నాకంతా తెలుసు.. ఈవయస్సులో నీ కోరికలు నీకుంటాయి. దాన్ని తీర్చవలసిన బాధ్యత వాడిదే కదా!" అంది.

"అదికాదు.. నేను..' ఏదో చెప్పబోతూంటే మళ్లీ అడ్డుపడింది.

'నేనంతా విన్నానమ్మా.. భగవంతుడి దయవల్ల నా బిడ్డలు ఏలోటూ లేకుండానే వున్నారు. ఆడపిల్లలు అందరూ! వీడిపైన వాళ్ల బాధ్యతలేముంటాయి చెప్పు! మా ముసిళాళ్లిద్దరికీ నీ పిల్లలిద్దరూ కిందా మీదా పోసే మెతుకులంత ముద్దచాలు! వాడు నీ కోర్కెలు అవినీకో నీవాళ్లకో మాత్రమే అయితేనేం?" అంది.

మేఘమాల ఆమె వ్యంగ్యంగా అంటోందా నిజంగా అంటోందా, అని ఆమె కళ్లలోకి చూసింది.

ఆ ముసలి కళ్లలో ప్రేమ తప్ప, ఆందోళన తప్ప ద్వేషం కనిపించలేదు. ఇందిరాదేవి మేఘమాల తలనిమురుతూ, కేదార్‌కేసి చూసి నవ్వుతూ, "బాబూ! ఒకచీరకొంటే, మరో చీర

